క్లుప్తంగా

50 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధిలోని రెడ్డివారిపల్లి, గాయంవారిపల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటింటి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 50 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య క్యాంప్‌లో డాక్టర్ లక్ష్మి భార్గవి బీపీ, సుగర్, రక్త పరీక్షలు, జలుబు, దగ్గు, జ్వరాలకు పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందచేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలిచ్చారు. 104 వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

హనుమంతునిపాడు: మండల పరిధి ముప్పాళ్లపాడు పంచాయతీ వ్యవసాయ పొలాల్లో పేకాట స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోనికి తీసుకున్నారు. మరో ముగ్గురు పారిపోయారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు..ముప్పాళ్లపాడు పంచాయతీ పరిధిలో వ్యవసాయ పొలాల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. దీంతో హనుమంతునిపాడు పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వారి వద్ద మూడు ఫోన్లు, మూడు బైక్లు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి రూరల్: పట్టణంలోని టకారిపాలెం, దేవాంగనగర్, కాశిరెడ్డి కాలనీ, కాశీపురం తదితర ఏరియాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

శాకంబరి అలంకరణలో కామాక్షమ్మ


శాకంబరి అలంకారంలో కామాక్షమ్మ

కందుకూరు: పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న కామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మంగళవారం ఆషాడమాస ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామాక్షి అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా శాకాంబరి రూపంలో అలంకరించారు. అమ్మవారి అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు అన్నమాచార్యులు, అయ్యప్పస్వామి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


తిమ్మారెడ్డిపాలెంలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లింగసముద్రం: మండలంలోని తిమ్మారెడ్డిపాలెం పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున దోమలు ప్రబలకుండా ఉండేందుకు గ్రామాల్లో పారిశుధ్యపనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో మురుగుకాల్వలో నీరు నిల్వ లేకుండా చేశామన్నారు. పారిశుధ్య పనులు చేపట్టిన తరువాత బ్లీచింగ్ చల్లాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. గ్రామాల్లోని వాటర్‌ట్యాంకులను శుభ్రం చేసినట్లు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్, అటెండర్ లేక ఇబ్బంది

వలేటివారిపాలెం: స్థానిక జిల్లా పరిషత ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ రెండు పోస్టులకు సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బరామయ్య తెలిపారు. ఈ పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆన్‌లైన్ వ్యవహారాలు, పాఠశాల బిల్లులు, అడ్మిషన్లు తదితర పనులు కష్టతరంగా మారిందన్నారు. దీంతో ఈ పనులు ఉపాధ్యాయులతో చేయించుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఈ పాఠశాలలో 403 మంది విద్యార్థులు ఉన్నారని, మండలంలో మిగతా పాఠశాలలో 60, 70 మంది విద్యార్థులు ఉన్న చోట అన్ని పోస్టుల్లో సిబ్బంది ఉన్నారని, ఒక్క ఈ పాఠశాలలో పోస్టులు ఇంకా భర్తీ చేయలేదన్నారు. దీనిపై ఎంఈఓ-2ను మల్లికార్జున్‌ను వివరణ కోరగా..ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

ఇన్‌చార్జిలతో ఇబ్బందే..!



కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

- అంగన్‌వాడీలకు అధికారులు కావాలి..
- ఏడాదిన్నరగా రెండు ప్రాజెక్టులకు ఒక్కరే సీడీపీఓ
- వెలిగండ్లలో 9 క్లస్టర్‌లకు ఒక్కరే సూపర్‌వైజర్
- అధికారుల లేమితో కేంద్రాలపై పర్యవేక్షణ కరువు
- ఇన్‌చార్జి బాధ్యతలతో పెరుగుతున్న పనిభారం

కనిగిరి రూరల్: చిన్నారుల, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది కొరత అధికంగా ఉంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలపై అధికారుల నిఘా కొరవడిందంటే అతిశయోక్తి కాదు. కేంద్రాల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు కేంద్రాలను తనిఖీ చేయాల్సిన సీడీపీఓ, సూపర్‌వైజర్లు తగు రీతిలో ముందడుగు వేయలేక పోతున్నారంటే అతిశయోక్తి కాదు. కనిగిరి నియోజకవర్గంలో ఏడాదిన్నర నుంచే ఇన్‌చార్జి పాలనే సాగుతోంది.

9 క్లస్టర్లకు ఒక్కరే సూపర్‌వైజర్..

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రెండు సీడీపీఓ కార్యాలయాలున్నాయి. కనిగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కనిగిరి, పీసీపల్లి, పామూరు మండలాల్లో 9 క్లస్టర్లు ఉండగా ఆరుగురు రెగ్యులర్ సూపర్‌వైజర్లు ఉన్నారు. మిగిలిన మూడు క్లస్టర్లలో ఇన్‌చార్జిల పాలన సాగుతుంది. వెలిగండ్ల సీడీపీఓ పరిధిలోని వెలిగండ్ల, సీఎస్‌పురం, హెచ్‌ఎంపాడు పరిధిలో 9 క్లస్టర్లు ఉండగా వారిలో ఒకరు మాత్రమే రెగ్యులర్ కాగా, మరొకరు దర్శి నుంచి ఇన్‌చార్జిగా ఉన్నారు. మిగిలిన ఏడు క్లస్టర్లకు అంగన్‌వాడీ కార్యకర్తలను యాక్టివ్ సూపర్‌వైజర్ల పేరుతో నియమించి కాలం వెళ్లదీస్తున్నారు. కనిగిరి, వెలిగండ్ల ప్రాజెక్టులకు సంబంధించి సుమారు రెండేళ్ల నుంచి ఒక్కరే సీడీపీఓగా పాలన సాగిస్తున్నారు. దీంతో అంగన్ వాడీలపై పర్యవేక్షణ కొరవడటంతో పాటు, ప్రభుత్వ పథకాల అమలు తీరులోనూ తీవ్ర ఉదాసీనత జరుగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

కనిగిరి ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో 889 మంది గర్భిణులు, 864 మంది బాలింతలు ఉండగా, 6 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు 1075 మంది, 1-3 ఏళ్ల లోపు పిల్లలు 3,180 మంది, 3-6 ఏళ్ల లోపు పిల్లలు 4,194 మంది ఉన్నారు. వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల్లో గర్భవతులు 575 మంది, బాలింతలు 563 మంది, 6 నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు 695 మంది, ఏడాది నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 2,365 మంది, 3-6 ఏళ్ల లోపు పిల్లలు 2,468 మంది ఉన్నారు. సీడీపీఓ ఇన్‌చార్జి కావడంతో క్షేత్ర స్థాయిలో కనీసం పర్యవేక్షణ కొరవడిందని, కేవలం కార్యాలయానికే పరిమితమై అసలు పని విస్మరించారన్న విమర్శ ఉంది.

అదనపు భారం

ప్రస్తుతం ప్రభుత్వం ఐసీడీఎస్ సిబ్బందికి పనిభారాన్ని పెంచింది. ట్రాకింగ్ కార్యక్రమాన్ని ఐసీడీఎస్‌కు అప్పగించింది. అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో గర్భిణులు, బాలింతలు పిల్లల వివరాలు కూడా నమోదు చేయాలి. అంతేగాక ప్రతి సూపర్‌వైజర్ రోజుకు కనీసం 1,2 కేంద్రాలను తనిఖీ చేయాల్సి ఉంది. సీడీపీఓ, ఏసీడీపీలు నెలకు కనీసం 30 కేంద్రాలను తనిఖీ చేయాలి. సీడీపీఓ పర్యవేక్షణ అనేది కాగితాల్లోనే జరుగుతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌చార్జిల పాలనతో ఆ ప్రక్రియ మమ అనిపిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

కనిగిరి నియోజకవర్గంలోని అంగన్‌వాడీ ప్రాజెక్టులు వాటి వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	సెక్టార్లు	సూపర్ వైజర్లు
కనిగిరి	102	4	3
పామూరు	79	3	2
పీసీపల్లి	58	2	1

వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలో ..

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	సెక్టార్లు	సూపర్ వైజర్లు
వెలిగండ్ల	64	3	1
హెచ్ ఎంపాడు	68	3	1 (దర్శి నుంచి ఇన్‌చార్జి)
సీఎస్‌పురం	73	3	0 కార్యకర్తలే ఇన్‌చార్జిలు)

> **ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా:**
> కనిగిరి, వెలిగండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవం. సూపర్‌వైజర్లు చాలా తక్కువగా ఉన్నారు. రెండు ప్రాజెక్టులకు ఒక్కరినే ఏడాదిన్నర నుంచి సీడీపీఓగా ఉన్నా. ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా. తన పరిధిలో ప్రతి నెల అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నా. పనిభారం వల్ల కొంత ఇబ్బందులు పడుతున్నాం. వెలిగండ్ల సీడీపీఓ పోస్టును, రెండు ప్రాజెక్టుల్లో సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేస్తే బాగుంటుంది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాల అమలు పర్యవేక్షణ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో పకడ్బందీగా అమలు అవుతాయి.
> సరోజిని, సీడీపీఓ, కనిగిరి, వెలిగండ్ల ప్రాజెక్టులు


వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న డీఎస్పీ, చైర్మన్

అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- డీఎస్పీ రత్నాకరం రామరాజు

కనిగిరి రూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని అందరూ సమష్టిగా పని చేయాలని కనిగిరి డీఎస్పీ రత్నాకరం రామరాజు అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో వాల్‌పోస్టర్ విడుదల, అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రత్నాకరం రామరాజు మాట్లాడుతూ సైబర్ నేరాల ద్వారా మానవ అక్రమ రవాణా కొత్త రూపం దాల్చుతుందన్నారు. సైబర్ స్కామింగ్ ద్వారా జరిగే మానవ అక్రమ రవాణాను గుర్తించడం, నిరోధించడం, చర్చించడం, దృష్టి సారించి నిరోధించడం అవసరమన్నారు. మానవ అక్రమ రవాణ మానవ హక్కులు, బాలల హక్కులు ఉల్లంఘన జరుగుతుందని, అమాయకుల ప్రాణాలు బలవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పారాలీగల్ వలంటీర్లు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరక్టర్ మంద్రు రమేష్, శ్యామ్యుల్, ప్రవీణ్‌కుమార్, రాజేష్, నవకుమార్, సలోమి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మర్రిపూడి: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మర్రిపూడి ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి సీహెచ్ వీరబాబు అన్నారు. మర్రిపూడిలో మంగళవారం ఆయన పర్యటించి మలేరియా, డెంగీ, కుష్టు వ్యాధులపై అవగాహన కల్పించారు. చెత్తా చెదారం ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు సూచనలు చేశారు. జ్వరం వస్తే వెంటనే సమీపంలోని వైద్యశాలకు రావాలన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి జ్వరాలపై ఆరా తీశారు. ఆయన వెంట సీహెచ్ నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


వ్యాధులపై అవగాహన చేస్తున్న వైద్యాధికారి వీరబాబు

అక్రమంగా చిల్లకర్ర తరలింపు


చెరువు నుంచి తరలించేందుకు సిద్ధం చేసిన చిల్లచెట్లు

కొండపి(సింగరాయకొండ): మండల కేంద్రమైన కొండపి చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు గత కొన్ని రోజుల నుంచి చిల్ల కర్ర కొట్టుకొని అక్రమంగా తరలిస్తున్నారు. ఈ చెరువు కొండపి, కట్టవారిపాలెం గ్రామాలకు సంబంధించినది. అటు కట్టవారిపాలెం, ఇటు కొండపి వైపు చిల్లచెట్లను అక్రమంగా నరికేస్తున్నారు. టన్ను మూడు వేల నుంచి నాలుగు వేల రూపాయల వరకు అమ్ముకుంటున్నారు. దీంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని కొండపి వాసులు కోరుతున్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం పంచాయతీ పరిధిలోని ఎస్టీ రాజుపాలెం గ్రామశివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలియడంతో పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోనికి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.17,740 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు.

అంగన్‌వాడీల్లో హాజరుశాతం మెరుగుపరచాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, గర్భిణులు, బాలింతలు

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో కార్యకర్తలు సమయపాలన పాటించి విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.దేవకృపావరం అన్నారు. మండలంలోని నల్లమడుగుల ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం సూపర్‌వైజర్ కె.దేవకృపావరం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పౌష్టికాహార ఆవశ్యకతపై వివరించారు. అదే విధంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు ఇచ్చే పౌష్టికాహారం సకాలంలో ఇవ్వాలన్నారు. పౌష్టికాహారం తీసుకునేవారి పేర్లు విధిగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని, చిన్నారు బరువులు క్రమం తప్పకుండా నమోదుచేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మూడేళ్లు నిండిన పిల్లలను విధిగా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ కృపావరం

నీటి నిల్వలు తొలగించకుంటే జరిమానా

పామూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ప్రజలు తమ నివాసాలకు చుట్టుపక్కల ప్రాంతంలో ఖాళీగా ఉన్న నివేశనా స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఈఓపీఆర్‌డీ కేఎల్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీటి నిల్వలు ఉంటే దోమల పెరుగుదలతో డెంగీ, చికెన్‌గున్యా, సీజన్‌వ్యాధులు దోమలద్వారా వచ్చే అవకాశం ఉందన్నారు. దీన్ని నివారించేందుకు ఇళ్లమధ్య నివేశనా స్థలాలు ఉన్నవారు వారి స్థలాల్లో నీటి నిల్వ లేకుండా చూడాలని, లేకుంటే పంచాయతీల ఆధ్వర్యంలో జరిమానా విధిస్తామని, నివాస నిర్మాణానికి అనుమతులు నిలిపివేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ


చతుకుపాడులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కేవీపాలేనికి చెందిన చార్టర్డ్ అకౌంటెంట్ నల్లూరి వెంకట శేషయ్య ఆర్థిక సహకారంతో సుమారు రూ.1.50 లక్షల విలువైన నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేసినట్లు ఎంఈఓ బి.నాగేంద్రవదన్ తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ.. దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. చతుకుపాడు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎంఈఓతో పాటు ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు టి.శ్రీలక్ష్మి, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన


పొన్నలూరులో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొన్నలూరు: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధి నిర్మూలనపై మంగళవారం స్థానిక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ దామా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. చర్మంపై స్పర్శ లేకపోవడం, నొప్పి, దురదలేని మచ్చలు, రాగిరంగు మచ్చలు, చేతులు, పాదాలు తిమ్మిరిగా ఉండటం కుష్టు వ్యాధి లక్షణాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి సర్వే చేపట్టి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకు వేలానికి తీసుకురావాలి


టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: పొగాకు రైతులు వేలం కేంద్రానికి నాణ్యమైన పొగాకు బేళ్లు వేలానికి తీసుకువచ్చి అధిక ధరలు పొందాలని వేలం నిర్వహణాధికారి సూచించారు. స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం నిర్వహించిన అనధికారిక వేలంలో పొగాకు గరిష్ట ధర రూ. 360 పలికింది. టంగుటూరు, జరుగుమల్లి, వావిలేటిపాడు, సాదువారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 947 బేళ్లను తీసుకురాగా వాటిలో 844 బేళ్లను కొనుగోలు చేసి 103 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.360, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ.300 పలికింది. వేలంలో 44 మంది వ్యాపారులు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కందుకూరుకు కృష్ణా జలాలు తీసుకొస్తా

కందుకూరు: కందుకూరు నియోజకవర్గంలో తాగు, సాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు వెలిగొండ ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను కందుకూరుకు తరలించేలా ప్రణాళిక రూపకల్పన జరుగుతుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మోపాడులో మంగళవారం జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు తూర్పు కాల్వ నుంచి రూ.350కోట్ల ఖర్చుతో ప్రత్యేక కాల్వను తవ్వడం ద్వారా కందుకూరు, కనిగిరి, కొండపి నియోజకవర్గాలకు ప్రయోజనం ఉంటుందన్నారు. ఈ ప్రతిపాదన గురించి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు వివరించగా వారు అంగీకరరించారని, ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు వివరించారు. అలాగే త్వరలో సర్వే కూడా చేపడతామని, ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే కందుకూరు నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించవచ్చునని చెప్పారు. కందుకూరు, వలేటివారిపాలెం, మండలాలు, పట్టణ అధ్యక్షులు నార్నే రోశయ్య, మాదాల లక్ష్మీనరశింహం, దామా మల్లేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తోకల వెంకటేశ్వర్లు, రావుల రవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

వెలిగండ్ల: వెలిగండ్ల-సూరావారిపల్లి గ్రామాల మధ్య ఉన్న ఓ రైతుపొలంలో మంగళవారం విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసేందుకు స్థంభాన్ని ట్రాక్టర్ ఇంజన్ వెనుక భాగానికి కట్టి పొలం వద్దకు తీసుకెళ్లారు. ట్రాక్టర్ ఇంజన్ నుంచి స్థంభాన్ని ఊడదీసే క్రమంలో ప్రమాదం జరగ్గా వెలిగండ్లకు చెందిన ట్రాక్టర్ యజమాని మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి సుబ్బారెడ్డికి తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది చికిత్స నిమిత్తం కనిగిరికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కనిగిరి నుంచి గుంటూరు తరలించారు.